రంజాన్ వేళలు | ఇఫ్తార్ (సోమ) సా.6.22 | సహరి (మంగళ) ఉ.4.48

ఎన్నికల నిబంధనలు పట్టవా!

» పలుచోట్ల తొలగించని రాజకీయ ఫ్లెక్సీలు, బోర్డులు » పట్టించుకోని అధికారులు

8లో



ప్రలోభాల జాతర

» ఎన్నికల షెడ్యూల్ రావడంతో అప్పుడే వైసీపీ నేతల బరితెగింపు
» వలంటీరు, పార్టీ కార్యకర్తలు, ఓటర్లకు రకరకాల తాయిలాలతో గేలం
» వలంటీర్లకు సెల్‌ఫోన్లు, కుక్కర్లు, నగదు ఇచ్చి ఓట్లు వేయించాలని ఒత్తిళ్లు
» అటు రాత్రి వేళల్లో పార్టీ క్యాడర్‌కు మందు, విందులతో ప్రలోభాలు
» వలంటీర్లకు ప్రాధాన్యంపై గుర్రుగా ఉన్న క్యాడర్‌ను దువ్వుతున్న వైనం
» రాత్రయితే గ్రామాల వారీగా ఓటర్లకు గుట్టుగా నగదు, గిఫ్ట్‌లు అందజేత
» కోడ్ ఉన్నా ఏమాత్రం ఖాతరు చేయకుండా ఇష్టానుసారం వ్యవహారం
» మరోపక్క మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు లక్షల్లో చీరలు సిద్ధం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల గంట మోగడంతో అప్పుడే అధికార వైసీపీ నాయకుల్లో వణుకు మొదలైంది. ఎక్కడ ఓటమి తప్పదోనన్న భయంతో అడుగడుగునా గుట్టుగా ప్రలోభాలకు తెర లేపుతున్నారు. డబ్బులు, గిఫ్ట్‌లు, చీరలు, విందులు, వినోదాలతో వలంటీర్ల దగ్గరనుంచి పార్టీ క్యాడర్, ఓటర్ల వరకు అందరినీ మచ్చిక చేసుకుంటున్నారు. ఎలాగైనా మీరే గెలిపించాలి అంటూ వేడుకుంటున్నారు. గ్రామాలవారీగా తాయిలాలు ఇస్తూ దారికి తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు ఎక్కడ చూసినా జిల్లాలో దాదాపు అన్ని నియోజక వర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రలోభాల వల భారీగా విసరడమే కనిపిస్తోంది. ఒకపక్క కోడ్ అమల్లో ఉందని తెలిసినా ఏమాత్రం వెరపు లేకుండా అడ్డంగా బరితెగించి వ్యవహరిస్తున్నారు. ఉదయం వేళల్లో వలంటీర్లతో రహస్య సమావేశాలు, గిఫ్ట్‌ల ఎరలు, రాత్రివేళల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు, ఓటర్లను పిలిపించి విందులు, వినోదాలతో దారికి తెచ్చుకునేందుకు నానాప్రయాస పడుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత భారీగా ఉన్నందున తమను ఆదుకునేది మహిళా ఓటర్లేనన్న అంచనాలతో వారిని సైతం కొనేందుకు సిద్ధమవుతున్నారు. లక్షల్లో చీరలకు ఆర్డర్లు ఇచ్చి గుట్టుగా గ్రామాలకు తరలిస్తున్నారు.

వ్యతిరేకత భయంతో వణుకు..

జగన్ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో ప్రజావ్యతిరేకతను భారీగా మూటగట్టుకుంది. రకరకాల పన్నుల వాత, ఛార్జీల మోత, అభివృద్ధి లేమి, నాసిరకం మద్యం, ఇసుక దోపిడీ ఒకటేంటి లెక్కలేనన్ని అక్రమాలు, అరాచకాలతో ప్రజల్లో భయం పుట్టించింది. ఇప్పుడు ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడం, వెంటనే కోడ్ అమల్లోకి రావడంతో నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు వణికిపోతున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత తమ కొంప ముంచేయడం ఖాయమనే భయంతో ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా అధికారపార్టీ నేతలు ఎన్నికల ప్రచారానికి వెళ్తే ఐదేళ్లలో చేసిందేంటో వివరించి ఓట్లడగడం ఆనవాయితీ. కానీ ఏం చేశామో చెప్పుకోవడానికి ఏం లేకపోవడంతో చివరకు ప్రలోభాలనే నమ్ముకున్నారు. అందుకే వలంటీర్ల ద్వారా ఓటర్లను బెదిరించో, బతిమాలో ఓట్లు రాబట్టుకునేందుకు పాచికలు విసురుతున్నారు. ఈ నేపథ్యంలో వలంటీర్లనే నమ్ముకుని వారి ద్వారా ఓట్లకు గేలం వేస్తున్నారు. వలంటీర్లు తమ పరిధిలోని ఇళ్లల్లో అందరితో తమకే ఓట్లు వేయించాలంటూ వారిని పిలిచి మరీ ఒత్తిడి తెస్తున్నారు. సమావేశంపేరుతో గుట్టుగా పిలిచి వెండి గిన్నెలు, వెండి గ్లాసులు, వెండి ఉంగరాలు, గిఫ్ట్‌లు, వాచీలు, సెల్‌ఫోన్లు అందిస్తున్నారు. త్వరలో డబ్బులు కూడా బ్యాంకు ఖాతాల్లో వేస్తామంటూ వారిని ఊరిస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే ఎన్నికల్లో వలంటీర్లే దిక్కు అన్నంతలా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే తునిలో మంత్రి రాజా వలంటీర్లకు వేలల్లో సెల్‌ఫోన్లు పంచారు. నగదు కూడా అందించారు. ప్రత్తిపాడులో వలంటీర్లకు వెండి గిన్నెలు, గ్లాసులు, దుస్తులు అందించారు. పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్ తదితర నియోజకవర్గాల్లో డబ్బులు, చీరలు అందించారు. అంతా కలిసి ఎన్నికలు అయ్యేవరకు తమ కోసం పనిచేయాలని, గెలిచిన తర్వాత ప్రభుత్వంలో మంచి స్థానం కల్పిస్తామంటూ ఎర వేస్తున్నారు. కొందరు అభ్యర్థులైతే ఏకంగా 2029లో జరగబోయే ఎన్నికల్లో మీరే అభ్యర్థులు అంటూ వారికి ఆశ చూపిస్తున్నారు. ఒకపక్క వలంటీర్లు ఎన్నికల విధులు, ప్రచారానికి దూరంగా ఉండాలని నిబంధనలు చెబుతున్నా చాలామంది వలంటీర్లు మాత్రం ఇవన్నీ కాదని గుట్టుగా వైసీపీ నేతల కోసం ప్రచారం చేస్తున్నారు.

తెగ దువ్వుతున్నారు..

ఎన్నికలు దగ్గరపడడంతో వైసీపీ అభ్యర్థులు వలంటీర్లను నమ్ముకుని వారికి అన్ని విధాలా తాయిలాలు ఇస్తుండడం ఇప్పుడు వైసీపీ క్యాడర్‌లో మంటలు రేపుతోంది. పార్టీకోసం పనిచేస్తున్న తమను కాదని వారికి ప్రాధాన్యం ఇవ్వడంపై మండిపడుతోంది. జనాల తరలింపు, ప్రచారా నికి రావాలని వీరిని అడుగుతుంటే తాము రాబోమని అనేక నియోజక వర్గాల్లో తెగేసి చెబుతున్నారు. తమ కంటే వలంటీర్లే ఎక్కువ కాబట్టి వారితోనే పనిచేయించాలంటూ ఖరాఖండీగా చెప్పేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంతకాలం క్యాడర్‌ను వదిలేసిన నియోజకవర్గ అభ్యర్థులు ఇప్పుడు వారిని తెగదువ్వుతున్నారు. మీరే తమను గెలిపించాలంటూ పొగుడుతున్నారు. ఇందుకోసం కీలక నేతలతో గ్రామాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి వారికి విందులు, మందు పంపిణీ, వినోదాలు అందిస్తున్నారు. రకరకాల వెరైటీలతో భోజనాలు పెడుతున్నారు. ఆయా గ్రామాల ఓటర్లను కూడా ఇక్కడకు రప్పించుకుంటూ పలకరిస్తూ అక్కడికక్కడే డబ్బు లు కూడా గుట్టుగా పంచుతున్నారు.

రాత్రిపూట విందులు

ఇటీవల పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలులో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గీత అనుచరులు పార్టీ టౌన్ కార్యాలయం లో రాత్రివేళలో పార్టీక్యాడర్‌తోపాటు ప్రజలకు భారీ విందు, మందు ఇచ్చారు. ప్రత్తిపాడు, తుని తదితర నియోజకవర్గా ల్లో రెండు రోజులుగా అర్ధరాత్రి విందులు యథేచ్ఛగా వైసీపీ నేతలు నిర్వహిస్తున్నారు. పార్టీపై తీవ్ర వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో ఇప్పటినుంచే ఓటర్లను దారికి తెచ్చుకునేందుకు మరింత బరి తెగిస్తున్నారు. ప్రస్తుతం ప్రచారం పేరుతో జనం వద్దకు వెళ్తుంటే ఐదేళ్లలో ఏం చేశారనే నిలదీతలు ఎదురవుతున్నాయి. దీంతో మహిళా ఓట్లకు గేలం వేసేం దుకు వారికి ఖరీదైన చీరలు కూడా కొందరు అభ్యర్థులు సిద్ధం చేశారు. జిల్లాకు మూలన ఉన్న ఓ నియోజకవర్గంలో సదరు అభ్యర్థి మొత్తం మహిళా ఓటర్లందరికీ పంచడానికి లక్షకుపైగా చీరలు కొనుగోలు చేసి సిద్ధం చేశారు. కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, ప్రత్తిపాడు, పెద్దాపురం, జగ్గంపేటలోను ఈ తరహా పంపకాల జాతరకు సిద్ధమవుతున్నారు. తద్వారా ప్రజా వ్యతిరేకత నేపథ్యంలో ఎవరూ తమ పార్టీకి ఓట్లేయకపోయినా మహిళా ఓట్లయినా ఎన్నో కొన్ని రాబట్టుకోవడానికి రక రకాల పన్నాగాలు పన్నుతున్నారు.



గొల్లప్రోలు వైసీపీ కార్యాలయం వద్ద భోజనాలు ఏర్పాటు చేసిన దృశ్యం

కోడ్ ఉల్లంఘనపై..
కేసు నమోదు

» పెద్దాపురంలో వైసీపీ నేతలపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు

పెద్దాపురం, మార్చి 18: ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఈనెల 17న పెద్దాపురం నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు విజయ సంకల్ప యాత్ర పేరుతో భారీ ప్రచారాన్ని చేపట్టారు. ప్రచారం నిర్వహించుకునేందుకు అనుమతులు తీసుకోకుండానే ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో ఆయన ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రచారానికి అనుమతి లేదని పోలీసులు ర్యాలీని అడ్డగించడంతో అర్థంతరంగా ప్రచారాన్ని ముగించుకుని తన కార్యకర్తలతో వెనుతిరిగారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారన్న విషయమై పలు సెక్షన్ల కింద పెద్దాపురం పోలీసులు కేసును నమోదు చేశారు. అనుమతి తీసుకోకుండా భారీ ర్యాలీని చేపట్టడంపై క్రైమ్ నెంబర్ 136/2024 అండర్ సెక్షన్ 143, 341, 283, 290 రెడ్ విత్ 149 ఐపీసీ సెక్షన్ 3(10) ఆఫ్ ఏపీ టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు. కమిషనర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఎఫ్‌ఐఆర్‌లో సుమోటోగా పేర్కొనడం గమనార్హం. దీనిపై సీఐ రవికుమార్‌ను వివరణ కోరగా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టిన తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు.

అరట్లకట్ట వైసీపీలో
రెండు వర్గాల మధ్య వివాదం

» ఇళ్ల పట్టాల సమయంలో రచ్చకెక్కిన విభేదాలు
» దౌర్జన్యం చేశారంటూ సర్పంచ్ ఫిర్యాదు

కరప, మార్చి 18: కరప మండలం అరట్లకట్ట గ్రామంలోని వైసీపీలో రెండు వర్గాల మధ్య వివాదం తారాస్థాయికి చేరుకుంది. ఇళ్ల పట్టాలు పంపిణీ చేసే సమయంలో సర్పంచ్ వర్గానికి, వ్యతిరేక వర్గానికి మధ్య ఈ వివాదం తలెత్తింది. ఎన్నికల కోడ్ సమీపిస్తుందనే కారణంతో ఈ నెల 15న గ్రామ సచివాలయంలో హడావిడిగా ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రొటోకాల్ ప్రకారం గ్రామ సర్పంచ్ గోపి సత్యవేణిని పిలిచి లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. అదే సమయంలో వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సోడగం సూరిబాబు, మాజీ సర్పంచ్ యరమాటి గోవిందులు కూడా పలువురికి పట్టాలు అందించారు. ఈ సమయంలో ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తింది. ఈక్రమంలో పైన పేర్కొన్న ఇద్దరు నాయకులు తనను దుర్భాషలాడుతూ దౌర్జన్యం చేయడానికి ప్రయత్నించారంటూ సర్పంచ్ సత్యవేణి కరప పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకుని తనకు రక్షణ కల్పించాలని ఆమె కోరారు. దీనిపై వ్యతిరేక వర్గానికి చెందిన నాయకులు కూడా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తొలుత తమను సర్పంచ్ దూషించారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ ఎన్నికల సమయం నుంచి వైసీపీలోని ఈ రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. వీరి మధ్య సఖ్యత కుదర్చడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమవడంతో అధికారపార్టీ పెద్దలు తలలు పట్టుకుంటున్నారు.

కొత్తపల్లిలో మత్స్యకారులతో..
మంత్రి రహస్య సమావేశం

కొత్తపల్లి, మార్చి 18: కొత్తపల్లిలో ఒక కన్వెన్షన్ హాలులో సోమవారం ఆర్‌అండ్‌బీ శాఖా మంత్రి దాడిశెట్టి రాజా మత్స్యకార ప్రతినిధులతో రహస్య సమావేశాన్ని నిర్వహించినట్టు సమాచారం. మత్స్యకారులు ఎలాగైనా సరే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని ఓడించేందుకు వైసీపీతో కలిసి రావాలని, ఈ విషయంలో మత్స్యకారులకు అన్నిరకాల లబ్ధి చేకూరేలా వైసీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపినట్టు సమాచారం. 15నిమిషాలపాటు జరిగిన సమావేశంలో పలువురు మత్స్యకార ప్రతినిధులు, సర్పంచ్‌లు పాల్గొన్నట్టు తెలిసింది.

రాజకీయ పార్టీల బ్యానర్లు తొలగించాలి: కలెక్టర్ కృతికాశుక్లా

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 18: రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన బ్యానర్లు, ఫొటోలు, హోర్డింగ్‌లు 72 గంటల్లో తొలగించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం ఆమె సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఫారం 6,7,8లకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారం, ఈ-ఎపిక్ కార్డుల పంపిణీ, పోలింగ్ కేంద్రాలు, వీవీ పాడ్స్‌పై వివరించారు. జిల్లాలో ఓటర్లు 16,11,171మంది ఉన్నారన్నారు. ప్రజాస్వామ్య విలువలను గౌరవించి రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలన్నారు. నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల క్రతువును సీవిజిల్ యాప్, పోలీస్, ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటస్టిక్స్ సర్వేలైన్స్ వంటివి నిత్యం పర్యవేక్షిస్తాయన్నారు. డీఆర్వో తిప్పేనాయక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, గదుల సాయిబాబా, సబ్బారపు అప్పారావు, వెంకటరమణ, రమేష్‌బాబు, చంద్రరావు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

'పది' పరీక్షలు ప్రారంభం

» జిల్లాలో తొలిరోజు 28,127మంది విద్యార్థుల హాజరు
» 97శాతం హాజరు నమోదు » ప్రశాంతంగా మొదటిరోజు పరీక్షలు

కాకినాడ రూరల్, మార్చి 18: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం కాకినాడ జిల్లాలోని 137 పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ తెలుగు పేపర్-1, కాంపోజిట్ పేపర్-1లను నిర్వహించామన్నారు. మొత్తం 28998మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 28127మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. 97శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. జిల్లా పరిశీలకులు 6, డీఈవో 7, అసిస్టెంట్ కమిషనర్ 5, తనిఖీ అధికారులు 35 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. 871మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాలేదని, 137మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 24 సిట్టింగ్, ఆరు ఫ్లైయింగ్ స్క్వాడ్లు, 1674మంది ఇన్విజిలేటర్లు పరీక్షలను పర్యవేక్షించినట్లు డీఈవో తెలిపారు. మంగళవారం హిందీ పేపర్ పరీక్ష జరుగుతుందన్నారు.

- సార్వత్రిక విద్య పది, ఇంటర్ పరీక్షలు కూడా సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు ఓపెన్ స్కూల్ కాకినాడ జిల్లా సమన్వయకర్త పి.సాయివెంకట రమణ తెలిపారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ జరిగాయన్నారు.



ఏలేశ్వరంలో పరీక్షా కేంద్రంవద్ద రూం నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

ఎన్నికల సంఘం సూచనలతో కరపత్రాల ముద్రణ

» జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 18: రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల ప్రకారం జిల్లాలో ప్రింటింగ్ ప్రెస్ యజమానులు కరపత్రాలు, గోడపత్రికలను ముద్రించాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్ సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ఆయన జిల్లాలో వివిధ ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఎన్నికల సంఘం సూచనల ప్రకారం రాజకీయ నాయకులు కరపత్రాలు ముద్రించాకోవాలన్నారు. సైజ్, ధర, కాపీల సంఖ్య వంటి అంశాల్లో తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలను పాటించాలని సూచించారు. ముద్రించిన పత్రాల వివరాలను ఆయా నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులకు అందించాలన్నారు. వీటిని ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల వివరాల్లో నమోదు చేస్తారన్నారు. సమావేశంలో జిల్లా పౌరసంబంధాల అధికారి నాగార్జున, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు జానకీరామ్, కిరణ్‌కుమార్, రాజేష్, శ్రీను పాల్గొన్నారు.



ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో మాట్లాడుతున్న డి.తిప్పే నాయక్

సిస్మిక్ సర్వేవల్ల నష్టం కలగకుండా చూస్తాం

» అధ్యయనం చేసి నెలరోజుల్లో నివేదిక ఇస్తామని హామీ
» మత్స్యకార సంఘాల ప్రతినిధులతో సమావేశంలో ఓఎన్జీసీ అధికారులు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 18: ఓఎన్జీసీ నిర్వహించ తలపెట్టిన సిస్మిక్ సర్వేవల్ల మత్స్యకారులకు ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారని మత్స్యకార సంఘాల ప్రతినిధులు వెల్లడించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా ఆధ్వర్యంలో ఓఎన్జీసీ అధికారులు, మత్స్యకార సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం జరిగింది. మత్స్యకార సంఘాల ప్రతినిధులు వాసుపల్లి కృష్ణ, సీహెచ్ శ్రీను, బ్రహ్మానందం, చక్రవర్తులు విలేకర్లతో మాట్లాడుతూ సిస్మిక్ సర్వేపై అధికారులు అధ్యయనం చేసి నెలరోజుల్లో నివేదిక ఇస్తామని వెల్లడించారన్నారు. ఓఎన్జీసీ ఆయిల్ నిక్షేపాలకోసం చేసే అన్వేషణలో భాగంగా చేసే సిస్మిక్ సర్వేవల్ల ఎంత మత్స్య సంపదకు నష్టం వాటిల్లుతుందనే అంశాలపై లోతుగా సర్వే చేసి నివేదిక రూపొందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ నివేదికకు నెలరోజులు సమయం పడుతుందన్నారు. సిస్మిక్ సర్వేవల్ల 40 గ్రామాల్లో రెండు లక్షల మంది మత్స్యకారులకు నష్టం కల్గుతుందని అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. సిస్మిక్ సర్వేవల్ల నష్టం కల్గితే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించామన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మత్స్యకార సంఘాల ప్రతినిధులు

దర్జాగా కబ్జాలు

» గండేపల్లి మండలంలోని సూరంపాలెం గుల్లమెట్టపై అక్రమ కట్టడాలు
» వైసీపీ నేతల అండతోనే పుట్టుకొస్తున్నాయని స్థానికుల ఆరోపణలు
» చోద్యం చూస్తున్న అధికారులు



గండేపల్లి మండలంలోని సూరంపాలెంలో స్థలాలుగా మారిన గుల్లమెట్ట కొండ

గండేపల్లి, మార్చి 18: గండేపల్లి మండలంలోని సూరంపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న గుల్లమెట్ట రోజురోజుకు అధికారపార్టీ నేతల అండదండలతో ఆక్రమణలకు గురవుతోంది. దీంతో పుట్టగొడుగుల్లా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. ప్రభుత్వాధికారులు కూడా ఏమాత్రం పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వ స్థలమని, ఇక్కడ కట్టడాలు నిర్మించకూడదని నామమాత్రపు బోర్డులు ఏర్పాటు చేయడం తప్ప అక్రమ కట్టడాలపై ఏమాత్రం చర్యలు తీసుకోవడంలేదని, అధికార పార్టీ నేతలకు తలొగ్గి ఉంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో నియోజకవర్గ నాయకుడి పేరుమీద కాలనీ ఏర్పాటు చేసి మరీ అక్రమాలు సాగిస్తున్నారంటున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఆ పార్టీ నాయకుల కళ్లన్నీ సూరంపాలెం గుల్లమెట్ట మీదే పడ్డాయని స్థానికులు విమర్శిస్తున్నారు. పేదవారి జీవనాధారానికి ఇచ్చిన మెట్టమీద ఉన్న భూములను తక్కువ డబ్బులు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేసి లక్షల క్యూబిక్‌మీటర్లు గ్రావెల్ అక్రమంగా, అనుమతులు లేకుండా ఇతర ప్రాంతాలకు తరలించి వందల కోట్లు సొమ్ములు చేసుకుంటున్నారని వారు చెప్తున్నారు. కొండకాస్త తరిగిపోవడంతో పక్కనే పేరుపొందిన రెండు కళాశాలలు ఉండడంతో అక్కడ సైట్లకు మంచి డిమాండ్ నెలకొంది. దీంతో అక్రమార్కులు ప్రభుత్వ అండదండలతో ఆ సైట్లను వదలకుండా రాత్రికి రాత్రే ఆక్రమించి కట్టడాలు, పలు హాస్టళ్ల నిర్మిస్తున్నారు. దీనిపై అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. అనధికార పట్టాలు సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది. 220ఎకరాలకు పైగా ఉన్న గుల్లమెట్ట వైసీపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి కరిగిపోయిందని వాపోతున్నారు.



రామేశంపేట మెట్టపై ప్రభుత్వ స్థలంలో ఆక్రమించి ఇళ్లు కట్టకూడదని పెట్టిన బోర్డు

సాగరతీరంలో త్రివిధ దళాల
విన్యాసాలకు ఏర్పాట్లు



కాకినాడ సాగర తీరం వద్ద ఆర్మీ ట్రక్కు

» కాకినాడ సూర్యారావుపేట సముద్రతీరం వద్ద నేవీ అధికారుల సన్నాహాలు
» 25 నుంచి 30 వరకు విన్యాసాలు

7లో

నేటినుంచి
కోరుకొండ తీర్థం

» ఆలయంలో చురుగ్గా ఏర్పాట్లు

7లో

అన్నవరంలో 24 నుంచి
స్వామివారి ఆర్జిత సేవ

7లో

లారీ ఢీకొని భార్య మృతి

7లో




నేటి నుంచి కోరుకొండ తీర్థం

భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవానికి శుభ ఘడియలు రానే వచ్చాయి. కోరుకుండ తీర్థం మంగళవారంతో ప్రారంభమవుతోంది. ఫాల్గుణ శుద్ధ చవితి మంగళవారం సాయంత్రం అంకురార్పణతో ప్రారంభమయ్యే స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 25వ తేదీ సోమవారం శ్రీ పుష్పయాగంతో పరిసమాప్తం కానున్నాయి.

కోరుకొండ, మార్చి 18:

చురుగ్గా ఏర్పాట్లు

ఆరురోజులు పాటు అంగరంగ వైభవంగా సాగే శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు కోసం అన్నవరం దేవస్థానం అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్, కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ ఎస్‌పీ రంగరాజభట్టర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించాలని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇవ్వకూడదని అన్ని ప్రభుత్వ శాఖలు, ధర్మకర్తలు, ఉత్సవ కమిటీ, గ్రామపెద్దలు, సహాయ సహకారాలతో సమన్వయం చేసుకుని స్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇప్పటికే అధికారులను కోరారు. ప్రతి రోజు వైదిక, వేద, శాస్త్ర, విద్వ గోష్టి, ధార్మిక, సంగీత, సాంస్కృతిక, జానపద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



స్వామి వారి ఆవిర్భావం

స్వామి వారు కృతయుగంలో వెలిసినట్లు వేద ప్రమాణం. 11వ శతాబ్ద కాలంలో వెలుగులోకి వచ్చినట్లు ఇక్కడ శిలాశాసనం తెలియజేస్తున్నాయి. స్వామి వారిని వ్యాస మహర్షి తండ్రి పరాసర మహర్షి అర్చించి తపస్సు చేసి సిద్ధి పొందారు. అందుకే కోరుకొండకు పరాసర గిరి అని పేరు వచ్చింది. ద్వాపర యుగంలో పాండవులు అజ్ఞాతవాసంలో ఉన్నప్పుడు ఈ కొండ వెనుక ఉన్న కొండ గృహల్లో తపస్సు చేసుకుంటూ ప్రతి నిత్యం నరసింహ స్వామిని అర్చించేవారని పురాణ గాథలు చెబుతున్నాయి. కాలక్రమేణా ఇది కోరుకొండగా ప్రసిద్ధి చెందింది. ధాన్యపు రాశి వలే కోరుగా ఉండే కొండపై స్వామి వెలిశారు కాబట్టి ఈ కొండకు కోరుకొండ అని పేరు వచ్చింది. 600లకు పైగా మెట్లు భక్తితో ఎక్కి స్వామి వారిని దర్శనం చేసుకుంటే భక్తులు కోరిన కోర్కెలు నెరవేరుతాయని ప్రతీక. ప్రస్తుతం ఇక్కడ కొండపైన ఏక కాలార్చన జరుగుతుంది. అదే విధంగా కోరుకొండపై స్వామి వారు స్వయంభూగా వెలిచారు. కోరుకొండ కొండకు సువర్ణగిరి, వేదాద్రి, పరాసర శైలము, పారిజాత గిరి అనే పేర్లు కూడా ఉన్నాయి. స్వామి వారి కొండ చుట్టూ భక్తులు గిరి ప్రదక్షిణ చేసే అవకాశం ఉంది. భారతదేశంలో అరుణాచలం తర్వాత ప్రతినిత్యం కోరుకొండ కొండ చుట్టూ భక్తులు 3 సార్లు గిరి ప్రదక్షిణ చేస్తే కోర్కెలు నెరవేరతాయని భక్తుల నమ్మకం. ప్రతి సంవత్సరం స్వామి వారి కల్యాణ మహోత్సవానికి 10 రోజులు ముందు 200 మంది భక్తులు నరసింహ మాల ధరించి ఉదయం, సాయంత్రం గిరి ప్రదక్షిణ చేస్తారు.

తరలిరానున్న భక్తులు

రాష్ట్రం నలుమూలల నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా కోరుకొండ తీర్థానికి భక్తులు తరలిరానున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. అన్నవరం దేవస్థానం దత్తత దేవాలయంగా ఉన్న కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించాలని అన్నవరం దేవస్థానం వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఐవీ రోహిత్ అధికారులను కోరారు. మంగళవారం సాయంత్రం పుట్టమన్ను తెచ్చుట. అంకురార్పణ, ధ్వజారోహణం, గ్రామ బలిహరణ, సేవాకాలంతో స్వామి వారి కల్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. రంగరాజభట్టర్ స్వీయ పర్యవేక్షణలో వైకానస ఆగమబ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అనువంశిక అర్చకస్వాములు పెదపాటి, పెద్దింటి, పెరవలి వార్ల స్వీయ పర్యవేక్షణలో పాంతాయ్నిక దీక్షతో ఈ వైకానస, ఆగమ, శ్రీ వైష్ణవ సాంప్రదాయక స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం లోక కల్యాణార్థం, భక్త జన సంరక్షణార్థం జరిపించనున్నారు.



స్వామి వారి చరిత్ర

మంచి కొండ రెడ్డిరాజు క్రీ.శ 1325- 1395 మధ్య కోరుకొండను రాజధానిగా చేసుకుని 70 ఏళ్లు పరిపాలించారు. ఆ సమయం లోనే కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయం దివ్య క్షేత్రంగా విరాజిల్లింది. 1340-1370 మధ్య రాజుగా ఉన్న ముమ్మిడి నాయకుడు శ్రీరంగంలోని శ్రీ వైష్ణవ గురువుల శిష్యత్వం చేసి శ్రీరంగం నుంచి కోరుకొండకు పరాసర భట్టర్ వంశీకులను తీసుకొచ్చారు. స్వామి వారి కైంకర్యాలు చేసేందుకు తీసుకొచ్చారు

ఆలయ నిర్మాణం

ముమ్మిడి నాయకుడు భార్య లక్ష్మీదాసి గొప్ప వైష్ణవ భక్తురాలు. ఆమె క్రీస్తు శకం 1353 విజయ సంవత్సరం ఫాల్గుణ శుద్ధ దశమి గురువారం రోహిణి నక్షత్రంలో కొండపైన దేవాలయం నిర్మాణం చేశారు. సుమారు 10 సెంట్లు వైశాల్యం గల కోరుకొండ కొండ శిఖరంపైన ఈ దేవాలయం నేటికి చెక్కుచెదరకుండా ఉంది. కొండదిగువున మరొక పెద్ద దేవాలయం నిర్మించారు.



కొండ దిగువున స్వామివారి పాదాలు

కల్యాణ మండపాలు

1353లో ముమ్మిడి నాయకుడు స్వామికి కొండపైన, కొండ దిగువున రెండు పురాతన రాతి కల్యాణ మండపాలు నిర్మించారు. స్వామి వారికి భూదానాలు, గ్రామదానాలు ఇచ్చారు. కోరుకొండ గ్రామాన్ని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి సర్వ అగ్రహారంగా ప్రకటించారు. అదే విధంగా 1100 ఎకరాల భూమిని 72 మందికి నౌకరీ ఈనం భూముల కింద ఇచ్చారు. అవి కాకుండా లక్ష్మీ దాసి స్వామి వారికి నిత్యధూపదీప నైవేద్యాలకు, పూజా ఉత్సవాలకు రెండు గ్రామాలు 300 ఎకరాల భూమిని దానం ఇచ్చారు. వాటికి 1864లో ఈనం కమిషనర్ పట్టాలు ఇచ్చారు. దాంతో ఆ భూములన్ని పట్టాలు పొందిన వారు అమ్ముకుని వారిలో చాలా మంది నేడు స్వామివారికి సేవలు చేయడం తగ్గించారు. స్వామి వారి భూములన్ని ఎస్టేట్ అండ్ ఎబాస్‌మెంట్ యాక్ట్ ద్వారా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం స్వామి వారికి 15 ఎకరాల భూమి మాత్రమే మిగిలింది. స్వామి వారి నిత్య దీప ధూప నైవేద్యాలు చేయడం కూడా కష్టంగా ఉన్న నేపథ్యంలో సుమారు 12 సంవత్సరాలు క్రితం కోరుకొండ దేవస్థానాన్ని అన్నవరం దేవస్థానం దత్తత తీసుకుంది.

కిక్ బాక్సింగ్‌లో కాంస్యం



విద్యార్థిని అభినందిస్తున్న వీసీ, ఇతర అధికారులు

దివాన్‌చెరువు, మార్చి18: అఖిల భారత విశ్వవిద్యాలయాల కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థి సీహెచ్ దినేష్ కాంస్య పతకం సాధించినట్టు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు సోమవారం తెలిపారు. మీరట్‌లోని స్వామి వివేకానంద సుభార్తి విశ్వవిద్యాలయంలో జరిగిన పోటీల్లో నన్నయ అనుబంధ కళాశాలైన రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న దినేష్ 81 కిలోల విభాగంలో కాంస్య పతకం కైవసం చేసుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా దినేష్‌కు కాంస్య పతకాన్ని వీసీ అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, క్రీడా బోర్డు కార్యదర్శి బి.రామ్‌గోపాల్, కల్నల్ సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ బి.మధుకుమార్, రాజోలు కళాశాల ఇంగ్లీషు లెక్చరర్ ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



ఆత్రేయపురం, మార్చి 18: బీటెక్ చదివినా ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు ఓ యువకుడు. వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం నార్కెడుమిల్లికి చెందిన నల్లి శ్రీనివాస్-అనంతలక్ష్మి దంపతులకు ఏకైక కుమారుడు శ్రీకాంత్‌కుమార్ (23). తండ్రి శ్రీనివాస్ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. తల్లి అనంతలక్ష్మి కువైట్‌లో ఉంటూ కుటుంబాన్ని పోషిస్తూ కుమారుడిని బీటెక్ వరకు చదివించింది. ఉద్యోగ ప్రయత్నాలతో విసిగివేసారిన కుమార్ ఆదివారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. స్థానికులు అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆసుపత్రికి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. శ్రీకాంత్‌కుమార్ మృతితో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి.



శ్రీకాంత్

24 నుంచి స్వామివారి ఆర్జిత సేవ

అన్నవరం, మార్చి 18: అన్నవరం శ్రీవీర వెంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానం నందు ఈనెల 24 నుంచి ప్రతీ ఆదివారం స్వామివారి రథసేవ, ఆర్జీత సేవ జరుగతుంది. రథసేవలో భాగంగా స్వామి, అమ్మవార్లు ప్రాకార మండపం చుట్టూ ప్రదక్షిణ చేయు సేవలో పాల్గొనే భక్తుల టిక్కెట్ రుసుమును రూ.2500లుగా నిర్ణయించారు. రథసేవ నందు పాల్గొనే భక్తులకు రథయాత్ర ప్రారంభంలో గోత్ర నామాలతో సంకల్పం చెప్పి కండువా, రవికతో పాటు రెండు ప్రసాదం ప్యాకెట్లు అందిస్తారు. రథయాత్ర పూర్తయిన తర్వాత కుటుంబ సభ్యులకు శ్రీస్వామి అంతరాలయ దర్శనం, వేద ఆశీర్వచనం అందిస్తారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవస్థానం అధికారులు కోరారు.

చింతలూరు జాతరపై అధికారుల సమీక్ష

అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచన



సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో సత్యనారాయణ

ఆలమూరు, మార్చి 18: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరు నూకాంబికా అమ్మవారి జాతర, ఉత్సవాలను అధికారులు, స్థానికులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ సూచించారు. ఏప్రిల్ 7 నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాల ఏర్పాట్లపై సోమవారం ఆయన ఆలమూరు రెవెన్యూ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. జాతరకు వేలాదిగా భక్తులు తరలి రానున్న దృష్ట్యా వారికి అసౌకర్యం కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా చంటి పిల్లలకు ఇబ్బంది కలగకుండా చలువ పందిళ్లు వేయించాలని సూచించారు. ఏప్రిల్ 7న ప్రధాన జాతర, 8న తీర్థం, 9న జాతర మహోత్సవంతో పాటు నెల రోజులు భక్తులు అధిక సంఖ్యలో వస్తారని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఆ శాఖ అధికారులను కోరారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికారులతో ఆలమూరులో సమీక్షించామని, వచ్చే సమావేశాన్ని చింతలూరులో నిర్వహిస్తామని ఆర్డీవో చెప్పారు. తహసీల్దారు అనిల్‌కుమార్, ఎంపీడీవో మేరీరోజ్, రావులపాలెం సీఐ రామ్‌కుమార్, ఆలమూరు ఎస్‌ఐ శ్రీనునాయక్, నూకాంబికా దేవస్థానం ఈవో ఎంఎస్ఆర్ కృష్ణ, జేపీ భాస్కర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డెయిరీ ఫుడ్స్‌లో అధికారుల తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

దివాన్‌చెరువు, మార్చి 18: దివాన్ చెరువులోని సంతోష్‌నగర్‌లో బాబా డెయిరీ ఫుడ్స్ షాపులో విజిలెన్స్ ఫుడ్‌సేఫ్టీ, లీగల్, మెట్రాలజీ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు కలసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఆ డైరీ ఫుడ్స్‌కు ప్యాకింగ్ లైసెన్సు లేకపోవడం, అవిన్ డ్రీంక్రీమ్ 30ఎంఎల్ ప్యాకెట్స్‌పై మెండిటరీ డిక్లరేషన్ లేకపోవడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు రెండు కేసులు నమోదు చేశారు. అలాగే ట్రేడ్ లైసెన్సు పొందకపోవడంతో పంచాయతీ కార్యదర్శి రూ.2,204 అపరాధ రుసుము విధించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు డైరీ నుంచి కుల్ఫీ, మీడియం ఫ్యాట్‌ఫ్రోజన్ డెజర్ట్‌ల నమూనాలను విశ్లేషణ నిమిత్తం సేకరించారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఐస్‌క్రీమ్ తయారీదారులు, స్వీట్‌స్టాల్స్, రెస్టారెంట్ల యాజమాన్యాలు వాటి పరిసరాలను, కిచెన్లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అధికారులు ముత్యాలనాయుడు, భార్గవమహేష్, జగన్నాథరెడ్డి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



సాగర తీరంలో గుడారాలు ఏర్పాటు చేసుకున్న దృశ్యం

త్రివిధ దళాల విన్యాసాలకు

కాకినాడ తీరంలో ఏర్పాట్లు

సర్పవరం జంక్షన్, మార్చి 18: దేశ రక్షణ, భారత భూభాగం దురాక్రమణకు పాల్పడుతున్న ఉగ్రవాదుల నిర్మూలన, శత్రు దేశాలతో యుద్ధసమయంలో భారత త్రివిధ దళాలు నిర్వహించే త్రివిధ దళాల విన్యాసాల నిర్వహణకు నేవీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట సాగర తీరంలో నేవెల్ ఎన్‌క్లేవ్ వద్ద భారత త్రివిధ దళాలైన ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ దళాలు ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే విన్యాసాలు కోసం ఆ శాఖ ఉన్నతాధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. విశాఖ నుంచి ఆర్మీ వాహనాల్లో సిబ్బంది పలు ట్రూప్‌లతో సోమవారం బీచ్‌కు చేరుకుని గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. విన్యాసాల నిర్వహణ కోసం అనువైన ప్రదేశాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. రెండు మూడు రోజుల్లో యుద్ధ ట్యాంకర్లు ఒకట్రెండు రోజుల్లో విన్యాసాల్లో పాల్గొనే వైమానిక దళం, యుద్ధ ట్యాంకర్లు ఇక్కడకు చేరుకునేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. విన్యాసాలు జరిగే సముద్ర తీరంలో పరిశుభ్రత, ప్రత్యేక శానిటేషన్ పనులను కార్యదర్శి వెంకటరత్నం ఆధ్వర్యంలో శానిటేషన్ సిబ్బంది నిర్వహించారు.

లారీ ఢీకొని భార్య మృతి

భర్తకు తీవ్రగాయాలు



భార్య మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త

రాజానగరం, మార్చి 18: జాతీయ రహదారిపై తూర్పుగోనగూడెం సమీపంలో సోమవారం జరిగిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. గండేపల్లి మండలం ఎస్వీ రాజాపురానికి చెందిన పిల్లి లోవకుమారి(40)- భర్త దుర్గారావు అనారోగ్యం కారణంగా బైక్‌పై రాజమహేంద్రవరం ఆస్పత్రికి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్తున్న తరుణంలో మార్గమధ్యంలో తూర్పుగోనగూడెం సమీపంలో బైక్‌ను వెనుకవైపు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో లోవకుమారి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. దుర్గారావుకు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో చికిత్స కోసం తరలించారు. సంఘటనా స్థలంలో భార్య మృతదేహం వద్ద దుర్గారావు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు స్థానికులను కలచివేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించామని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు



స్ట్రాంగ్ రూమ్ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయసునీత

రంపచోడవరం, మార్చి 18: రానున్న సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఆమె ఎస్పీ తూహిన్‌సిన్హా, ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్‌తో కలిసి నియోజకవర్గానికి సంబంధించిన రూట్ మ్యాప్‌ను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఈవీఎంల భద్రత, ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్, ఎన్నికల అధికారులకు వాహనాల ఏర్పాటు తదితర అంశాలపై సూచనలు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, తహశీల్దారు ఎ.కృష్ణజ్యోతి, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ మోహన్‌రావు, డీటీలు సత్యనారాయణ, శివ, చైతన్య, విశ్వనాథం, సుబ్బారావు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూం పరిశీలన

త్వరలో నిర్వహించే సార్వత్రిక ఎన్నికలకు పటిష్టమైన చర్యలు చేపట్టామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత చెప్పారు. ఎస్పీ తూహిన్ సిన్హా, సబ్ కలెక్టరు ప్రశాంత్‌కుమార్‌తో కలిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూమ్‌లకు జనరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ సంబంధించిన ఈవీఎంలను వేర్వేరుగా భద్ర పరచాలన్నారు. ఎన్నికల ముందు రోజు ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్‌కు సంబంధించి 25 కౌంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఏప్రిల్ 18 నుంచి వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు



ఆత్రేయపురం, మార్చి 18: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్య కల్యాణం, తీర్థం, రథోత్సవాలను ఏప్రిల్ 18 నుంచి 24వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లపై ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం వివిధ శాఖల అధికారులతో తొలి విడత సమావేశం నిర్వహించనున్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

రెండున్నరేళ్ల చిన్నారితో సహా పది మందికి గాయాలు



చిన్నారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

గోకవరం, మార్చి 18: గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామంలో సోమవారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. ఈ దాడిలో రెండున్నరేళ్ల చిన్నారి సహా 10 మందికి గాయాలయ్యాయి. బయట ప్రాంతం నుంచి గ్రామంలోకి ప్రవేశించిన ఓ పిచ్చికుక్క కనిపించిన వారిపై దాడి చేసుకుంటూ సంచరించింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు భయంతో ఇళ్లల్లోకి పరుగుల తీశారు. ఆరు బయట ఉన్న పశువులను, కోళ్లను కూడా తీవ్రంగా గాయపర్చింది. గాయపడిన వారు గోకవరం ప్రభుత్వాసుపత్రికి పరుగుల తీశారు. తీవ్రంగా గాయపడిన చిన్నారిని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చివరకు పిచ్చి కుక్కను గ్రామస్థులు హతమార్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా గ్రామంలో సుమారు 20కి పైగా వీధి కుక్కలను పిచ్చికుక్క కరవడంతో గ్రామస్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గ్రామంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కల నిర్మూలనకు అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



కుక్క దాడిలో గాయపడిన చిన్నారి

శృంగారవల్లభస్వామి హుండీల ఆదాయం లెక్కింపు

పెద్దాపురం, మార్చి 18: మండలంలోని తిరుపతి శృంగారవల్లభ స్వామి హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 95 రోజుల కాలానికి రూ. 30,92,530 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారులు బాబూరావు, వీరభద్రరావు, దేవస్థానం చైర్మన్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ దుష్ట పాలనకు చరమగీతం పాడాలి

టీడీపీ, జనసేన నేతల ప్రచారం



కొంగోడులో ప్రచారం చేస్తున్న నానాజీ, సత్తిబాబు, అనంతలక్ష్మి

కొంగోడు (కరప), మార్చి 18: వైసీపీ దుష్ట పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రతీ ఒక్క ఓటరు విజ్ఞతతో ఆలోచించి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని గెలిపించాలని కాకినాడ రూరల్ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ, టీడీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి కోరారు. మండలంలో కొంగోడు గ్రామంలో సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి మేనిఫెస్టోను వివరించి వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని, రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే తలంపుతోనే కూటమిగా ఏర్పడడం జరిగిందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆలోచన విధానాలు రాష్ట్రానికి ఎంతో అవసరమని గుర్తించాలని సూచించారు. గాజు గ్లాసు గుర్తుపై ఓటేసి నానాజీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో ఇరు పార్టీల నాయకులు గుల్లిపల్లి శ్రీనివాసరావు, చుండ్రు వెంకన్నరాయచౌదరి, కోటగిరి మహేంద్రబాబు, మామిడాల వెంకటేష్, తుమ్మలపల్లి మాచరరావు, కర్నాసుల పుష్పరాజు, బండారు మురళి, బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, వనుం నారాయణరావు, గండి వెంకటేశ్వరరావు, అప్పనపల్లి నారయ్య ఉన్నారు.

'మా ఇబ్బందులు ఎవ్వరికి పట్టవా'

పిఠాపురం, మార్చి 18: జయలక్ష్మి కోఆపరేటివ్ సొసైటీలో జరిగిన అవకతవకలతో డిపాజిటర్లు, ఖాతాదారులు తీవ్రంగా నష్టపోయారని, వారి ఇబ్బందులు ఎవ్వరికి పట్టడం లేదని బాధితులు, ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేశారు. పిఠాపురంలో సోమవారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, వృద్ధులు, వివిధ వర్గాల ప్రజలు తాము పొదుపు చేసుకున్న సొమ్మును, కష్టార్జితాన్ని సొసైటీలో పొదుపు చేసుకున్నారని తెలిపారు. సొసైటీలో ఉన్న సొమ్ము కోల్పోయి, పైసా ఆదాయం లేక మనోవేదనతో ఇప్పటికే 50మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. 29 బ్రాంచిల్లో 20వేలమంది బాధితులు ఉన్నారని.. తమ ఇబ్బందులు పరిష్కరిస్తామని, డిపాజిట్లు సొమ్ములు వెనక్కి ఇప్పిస్తామని హామీలు ఇచ్చినా ఇప్పటి వరకూ నెరవేరలేదని తెలిపారు. తమతో పాటు బంధువులు ఓట్లు అన్నీ కలిపి 5 లక్షల వరకూ ఉన్నాయని చెప్పారు. తమకు ఎవరు న్యాయం చేస్తే వారికి అండగా ఉంటామని వారు తెలిపారు. సమావేశంలో బ్రాహ్మణసేవాపరిషత్ అధ్యక్షుడు, డిపాజిటర్ల సంఘం ప్రతినిధి యనమండ్ర సూర్యనారాయణ, సీహెచ్ పళ్లంరాజు, సుబ్రహ్మణ్యం, భాస్కరరావు, కృష్ణారావు, ప్రకాష్, వెంకట త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

'ఫిజియోథెరపీ శిబిరాన్ని కొనసాగించాలి'

సామర్లకోట, మార్చి 18: భవిత విద్యా కేంద్రాల్లో విద్యార్థులకు ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ శిబిరాన్ని రోజూ కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సహిత విద్య సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం సామర్లకోట భవిత విద్యా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కేంద్రంలో అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను సమీక్షించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. భవిత విద్యాకేంద్రంలో హాజరవుతున్న వారి మేధస్సును పరిశీలించి మరింత కృషి చేయాలని సూచించారు. అంకిత భావంతో పనిచేస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. మొక్కుబడిగా ఏదో చేసాంలే అంటే మంచి ఫలితాలు రావని స్పష్టం చేశారు. సామర్లకోటలో దివ్యాంగులు సర్వేలో 320 మంది ఉన్నట్టు నిర్ధారణ అయ్యిందని, వారందరికీ ప్రభుత్వ సేవలు సద్వినియోగం చేసేందుకు విద్యార్థుల సంఖ్య మరింతపెంచాలని సూచించారు.

'గోవులను తరలించేవారిపై చర్యలు తీసుకోవాలి'

ఏలేశ్వరం, మార్చి 18: అక్రమంగా గోవులను తరలించేవారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత గట్టిం వెంకటరమణ, పలువురు నాయకులు సోమవారం ఏలేశ్వరం ఎస్‌ఐ సతీష్‌కు ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి తుని నుంచి యర్రవరం జాతీయ రహదారిపై వెళ్తున్న బొలెరో వ్యాన్‌లో గోవులను తరలిస్తున్నారని ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నాయకులు గమనించి వెంబడించారన్నారు. కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద బీజేపీ మండలాధ్యక్షుడు కూరాకుల రాజా వ్యాన్‌ను ఆపే ప్రయత్నం చేయగా వ్యాన్‌లో వ్యక్తులు రాజాపై వాగ్వాదానికి దిగి నెట్టేసి వెళ్లిపోయారని గోరక్షణ, హైందవ సైన్యం, హిందూ నేషన్ ఫౌండేషన్ వారికి విషయం ద్వారా తెలపగా కృష్ణవరం చేరుకుని కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌కు తెలపగా వారు స్పందించలేదని లిఖితపూర్వకంగా పేర్కొన్నారు. హైవేపై వాహనాల్లో గోవులను తరలిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కరప ఏఎస్‌ఐపై బదిలీ వేటు

కరప, మార్చి 18: కరప పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ప్రసన్నకుమార్‌ను ఉన్నపళంగా కాకినాడ డీఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేయడం చర్చనీయాంశమైంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు రాజకీయపరమైన ఒత్తిళ్లే కారణమని తెలుస్తుంది. శుక్రవారం రాత్రి విధులకు హాజరైన ఏఎస్‌ఐ ప్రసన్నకుమార్‌ను రాత్రికి రాత్రే డీఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేయాలంటూ జిల్లా ఎస్పీ నుంచి ఆదేశాలందినట్టు సమాచారం. దీంతో ఆయన హుటాహుటిన కాకినాడ డీఎస్పీ కార్యాలయానికి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయన పదో తరగతి పరీక్షలకు ఫ్లయింగ్ స్క్వాడ్ విధులు నిర్వహిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ అధికారపార్టీ నేతలు గత కొన్ని నెలలుగా ఆయనపై ఆరోపణాస్త్రాలు సంధిస్తున్నారు. ఎన్నికల వేళ ఆయన ఇక్కడుంటే తమకు ఇబ్బందులు తప్పవని భావించిన వైసీపీ పెద్దలు జిల్లా ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకువచ్చినట్టు తెలిసింది. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన రోజు రాత్రి ఆయన్ను డీఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. కరప పోలీస్ స్టేషన్ సిబ్బంది కొరతతో సతమతమవుతున్న తరుణంలో ఏఎస్‌ఐను అర్థాంతరంగా బదిలీచేయడం హాట్‌టాపిక్ అయ్యింది.

జగ్గంపేటలో అన్న క్యాంటీన్

జగ్గంపేట, మార్చి 18: ఎన్టీఆర్ విగ్రహం నందు గత 14నెలలుగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో సోమవారం చిత్రపు గోపాలరావు, సుందరమ్మ దంపతులు జ్ఞాపకార్థం వారి కుమారుడు పీటీ ప్రసాద్, సీతామహాలక్ష్మి దంపతుల ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన భోజనాలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండలాధ్యక్షుడు మారిశెట్టి భద్రం పేదలకు వడ్డించారు. కొత్త కొండబాబు, కింగం రమణ, దాపర్తి సీతారామయ్య, వేములకొండ జోగారావు, ఎండీ కాజా, దేగల సత్తిబాబు, రాయిసాయి, కొండ్రోతు శ్రీను, మారిశెట్టి గంగ, సాంబత్తుల చంద్రశేఖర్, నండ్ల చిరంజీవి, కొత్త నాగపండు, కేసిబోయిన చిన్ని, పుర్రె వీరబాబు పాల్గొన్నారు.

జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు

సామర్లకోట, మార్చి 18: భద్రత పాటించడం ద్వారా ప్రతీ కార్మికుడూ భవిష్యత్తును జయించవచ్చని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మురళీకృష్ణ పేర్కొన్నారు. సామర్లకోట రాక్ సిరామిక్ పరిశ్రమలో సోమవారం జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు, కార్మికులకు బహుమతుల పంపిణీ నిర్వహించారు. సంస్థ సీఈవో అనిల్ కుమార్ బిజావత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాధాకృష్ణ హాజరై పలు పోటీల్లో విజేతలైన కార్మికులకు బహుమతులు అందజేశారు. రెండేళ్లుగా సంస్థలో అమలుచేస్తున్న భద్రతా చర్యలను అభినందించారు. కార్యక్రమంలో బాలాజీ, టి.నీరజ్‌కుమార్, రాజేంద్రసింగ్ మాన్, వినోద పైక వాసుదేవ, చెల్లదురై, పీఆర్వో వీజీఎస్.కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురైన పంచాయతీ కార్యదర్శి

పెద్దాపురం, మార్చి 18: మండలంలోని గోరింట గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటలక్ష్మీదేవీ సోమవారం ఆకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. ఉదయం విధులకు హాజరై ఫోన్ మాట్లాడుతుండగా ఒక్కసారిగా కుప్పకూలి పోయారు. దీంతో ఆమెను పంచాయతీ, సచివాలయ సిబ్బంది సమీపం గ్రామం పులిమేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు మెరుగైన చికిత్స కోసం తరలించారు. ఇటీవల ఆమె అనారోగ్యంతో బాధపడుతుండడంతో సెలవుపై వెళ్లి ఆరోగ్యం కుదుటపడడంతో మళ్లీ విధుల్లో చేరారు. అయితే ఎన్నికల విధుల ఒత్తిడో, లేక ఉన్నతాధికారుల వేధింపుల కారణంగానో ఆమె మళ్లీ తీవ్ర అస్వస్థతకు గురయ్యారని స్థానికులు చెబుతున్నారు.



పులిమేరు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న కార్యదర్శి

పదో తరగతి పరీక్షల ప్రారంభం

» పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు



పిఠాపురంలో పరీక్షకు వెళ్తున్న విద్యార్థులు



కిర్లంపూడిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పిఠాపురం, మార్చి 18: పదోతరగతి పరీక్షలు జిల్లాలో సోమవారం ప్రారంభమయ్యాయి. పిఠాపురం పట్టణంతో పాటు మండలంలోని పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులు, వారికి సహాయంగా తల్లిదండ్రులు తరలివచ్చారు. పరీక్షా సమయం మించిపోతున్న వేళ కొందరు విద్యార్థులు ఉరుకులు పరుగులతో కేంద్రాలకు చేరడం కనిపించింది. విద్యార్థులు ఒకరికొకరు అభినందనలు తెలుపుకుంటూ తమకు ఏ రూమ్ కేటాయించారో తెలుసుకుని లోపలకు వెళ్లి ప్రశాంతంగా పరీక్ష చేశారు. పట్టణంలోని బీఎంఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్, భాష్యం ఇంగ్లీషు మీడియం పాఠశాలలు, మండలంలోని మల్లాం, విరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలకు 1557మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1554మంది హాజరయ్యారు. ముగ్గురు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద నిషేదాజ్ఞలు విధించారు.

గొల్లప్రోలు: పట్టణంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను సోమవారం విద్యాశాఖ ఆర్‌జేడీ నాగమణి, ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరుని పర్యవేక్షించారు. కాగా గొల్లప్రోలులోని జిల్లాపరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాలలు, మాధురి విద్యాలయ, శ్రీరామ విద్యానికేతన్, చేబ్రోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలకు 1083మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1079మంది హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు హాజరు కాలేదు.

కరప: మండలంలోని కరప, వేములవాడ, వేళంగి, పెద్దాపురప్పాడు, గొర్రిపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన 6 కేంద్రాల్లో 1023మంది రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా తొలిరోజు పరీక్షకు 14మంది గైర్హాజరయ్యారని ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ తెలిపారు. కేంద్రాల వద్ద అన్ని సదుపాయాలు కల్పించామని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగలేదన్నారు. కరప ఎస్‌ఐ టి.రామకృష్ణ, ఏఎస్‌ఐ వి.సూరిబాబు సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

తుని రూరల్: తుని పట్టణ, రూరల్‌లో 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 2,249 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 2215 మంది హాజరయ్యారని, 34 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో తెలిపారు.

గండేపల్లి: మండలంలో మల్లేపల్లి, తాళ్ళూరు, గండేపల్లి 3 పరీక్షా కేంద్రాల్లో 513 మందికి 495మంది హాజరైనట్టు ఎంఈవో నాయక్ తెలిపారు. 18మంది గైర్హాజరయ్యారని, పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

రౌతులపూడి: రౌతులపూడి, మూలగపూడి, ఎ.మల్లవరం కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలకు 22 మంది హాజరుకాలేదని ఎంఈవో కొండబాబు తెలిపారు.

ప్రత్తిపాడు: మండలంలోని ప్రత్తిపాడు, ధర్మవరం, లంపకలోవ, ఒమ్మంగి హైస్కూల్ పరీక్షా కేంద్రాల్లో 909 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 44 మంది విద్యార్థులు గైర్హాజరై 865 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసులు విస్తృత బందోబస్తు చేపట్టారు.

సర్పవరం జంక్షన్: కాకినాడ రూరల్ మండలంలో 15 ప్రభుత్వ హైస్కూల్స్, 34 ప్రైవేట్ స్కూల్స్‌కి చెందిన 2491 మంది విద్యార్థులు 10 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశారు. సోమవారం పేపర్-1 తెలుగు (కాంపోజిట్) పరీక్షను 2421 మంది విద్యార్థులు రాయగా, 70 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈవో ఎల్ గణేష్‌బాబు తెలిపారు.

సామర్లకోట: మండలం, పట్టణ పరిధిలో పదో తరగతి పరీక్షలకు తొలిరోజు 219 మంది విద్యార్థులు డుమ్మా కొట్టారు. మొత్తం 1,710 మంది విద్యార్థులకు 9 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేయగా 1,491 మంది హాజరయ్యారు. 219 మంది హాజరుకాలేనట్లు సామర్లకోట ఎంపీవో వై.శివరామకృష్ణయ్య వెల్లడించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఎం.వాణీకుమారి నేతృత్వంలో పరీక్షాకేంద్రంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.

పెద్దాపురం: పట్టణ, రూరల్ పరిధిలో 1671 మంది విద్యార్థులకు హాల్ టికెట్లు జారీచేయగా వారిలో 1607 మంది పరీక్షకు హాజరయ్యారని, 64 మంది హాజరుకాలేదని ఎంఈవో ప్రభాకర శర్మ తెలిపారు.

తాళ్లరేవు: మండలంలోని పటవల, తాళ్లరేవు, పి.మల్లవరం, ఇంజరం పరీక్షా కేంద్రాల్లో 1,118మంది విద్యార్థులకుగాను 1,059మంది హాజరుకాగా 46 మంది గైర్హాజరయ్యారని విద్యాశాఖాధికారులు తెలిపారు.

ఏలేశ్వరం: పట్టణంలో 4పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండలంలోని లింగంపర్తి జడ్పీ హైస్కూల్, ఏలేశ్వరంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, భాష్యం హైస్కూల్‌లో 897మందికి 861 విద్యార్థులు హాజరైనట్టు ఎంఈవో బి.అబ్బాయి తెలిపారు. కేంద్రాల్లో చీఫ్ సూపరిండెంట్లుగా ఎం.రజనీకుమారి, ఎస్.లక్ష్మీ తులసీ, వట్టి వెంకటరమణ, ఎస్.లక్ష్మణరావు ఉన్నారు.

కిర్లంపూడి: మండలంలో మొత్తం 1047మంది విద్యార్థులకు గాను 1013మంది పరీక్షకు హాజరైనట్లు ఎంఈవో టి.జోసఫ్ తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్నిసదుపాయాలు కల్పించామన్నారు.

తొండంగి: మండలంలో పరీక్షలకు మొత్తం 32 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. బెండపూడి పరీక్షా కేంద్రంలో 198 మంది, తొండంగిలో 218, దానవాయి పేటలో 281, కెపిపురంలో 252 మంది పరీక్షలకు హాజరైనట్టు ఎంఈవో షేక్ బాబ్జి తెలిపారు.

జగ్గంపేట: నియోజకవర్గంలో 6పరీక్షా కేంద్రాల్లో పరీక్షకు 1405 మందికి 1303 మంది హాజరుకాగా 102మంది గైర్హాజరయ్యారని ఎండీవో స్వామి చెప్పారు.

శంఖవరం: మండలంలో మొత్తం 892 మంది పరీక్షలు రాయల్సి ఉండగా 867 మంది రాశారు. 25 మంది గైర్హరయ్యారని విద్యాశాఖాధికారులుతెలిపారు.



గొల్లప్రోలులో పరీక్షా కేంద్రం వద్ద తనిఖీలో ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, ఆర్‌జేడీ నాగమణి



గండేపల్లిలో పరీక్షా రాసి వస్తున్న విద్యార్థులు

పొత్తు ధర్మాన్ని పాటించి పవన్‌ను గెలిపిద్దాం

మాజీ ఎమ్మెల్యే వర్మ



చెందుర్తి సదస్సులో పాల్గొన్న వర్మ

గొల్లప్రోలు రూరల్, మార్చి 18: పొత్తు ధర్మాన్ని పాటించి జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను గెలిపిద్దామని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ కోరారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి సగరిపేట వద్ద బీసీ, ఎస్సీల అవగాహనా సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులకు అన్ని విధాల అండగా ఉంటానని తెలిపారు. ఎవ్వరు ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదని టీడీపీ కార్యాలయం ఎల్లప్పుడు ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉంటుందన్నారు. గ్రామానికి చేర్చి పట్టాలు ఇస్తామని, డ్రెయిన్లు, రోడ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. చెందుర్తి వాసులకు 5 కిలోమీటర్ల దూరంలో పట్టాలు ఇస్తే ఎలా వెళ్లతారని ప్రశ్నించారు. అంతకుముందు దుర్గాడకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు వర్మను కలిశారు. కార్యక్రమాల్లో టీడీపీ మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సకుమళ్ల గంగాధర్, మల్లిపూడి వీరబాబు, మడికి ప్రసాద్, బోనబోయిన శివ, మట్ల శ్రీను, తాటిపర్తి త్రిమూర్తులు, నక్కా రాంబాబు, భద్రరావు ఉన్నారు.

'జగన్‌ని దళితులంతా ఓడించాలి'



తోటపేటలో సూపర్ సిక్స్ బాండ్లు పంచుతున్న నేతలు

తాళ్లరేవు, మార్చి 18: దళితుల సంక్షేమం కోసం రాజ్యాంగబద్ధంగా ఏర్పాటుచేసిన 27 సంక్షేమ పథకాలను తొలగించి దళితులపై దాడులు చేసిన జగన్‌ని దళితులంతా ఐక్యతతో ఓడించాలని టీడీపీ దళిత నేతలు జక్కల ప్రసాద్‌బాబు, పూడా వెంకటరామకృష్ణ ప్రజలను కోరారు. సోమవారం పోలేకుర్రు పంచాయతీ తోటపేట గ్రామంలో టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు వడ్లమూరి సతీష్ ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ బాండ్లను ఇంటింటికీ పంపిణీ చేశారు. దళితులంతా గుర్తించి ముమ్మిడివరం ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సాదనాల శివరామకృష్ణ, రేవు గోవరాజు, జనిపల్లి ఈశ్వరరావు, రేవు సత్యనారాయణ, సాదనాల ప్రసాద్, నిమ్మకాలయ సత్యనారాయణమూర్తి, దున్నా మహేంద్ర, యేరుపల్లి బీరన్న, వనమాడి వెంకటరమణ, రాంబాబు, బండి లక్ష్మణ్ పాల్గొన్నారు. కోరింగ పంచాయతీ, కాళీకాదేవిగుడి ప్రాంతంలో టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు వెంటపల్లి చంద్రమౌళి ఆధ్వర్యంలో టీడీపీనేత టేకుమూడి లక్ష్మణరావు సూపర్ సిక్స్ బాండ్లను పంపిణీ చేశారు. టీడీపీ నేతలు వా ద్రేవు వీరబాబు, జవ్వాది తాతాజీ, మాజీ జడ్పీటీసీ పొన్నమండ రామలక్ష్మి, మాజీ ఎంపీపీ టేకుమూడి అనంతలక్ష్మి, సత్యవేణి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

నాణ్యత లేని మధ్యాహ్న భోజనం!

గండేపల్లి, మార్చి 18: గండేపల్లి హైస్కూల్‌లో అల్లూరి సీతారామరాజు ట్రస్టు బెండపూడి నుంచి వచ్చే మధ్యాహ్నభోజన పథకం నాణ్యతగా ఉండడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బిర్యానీ ఉండలు కట్టి ముద్దయిపోతుందని వాపోతున్నారు.



ఎన్నికల నిబంధనలు పట్టవా..!

» పలుచోట్ల తొలగించని రాజకీయ ఫ్లెక్సీలు, బోర్డులు » పట్టించుకోని అధికారులు



కరపలో ఒక వైన్‌షాప్ వద్ద వైసీపీ పోస్టర్లు



తుని రూరల్: సీతయ్యపేటలో పలు ఫ్లెక్సీలు

కరప, మార్చి 18: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా నేటికీ పలుచోట్ల అధికారపార్టీకి చెందిన పోస్టర్లను అధికారులు తొలగించలేదు. జనసేన, టీడీపీ ఫ్లెక్సీలను తొలగించడంలో చూపిస్తున్న శ్రద్ధ అధికారపార్టీకి చెందిన ఫ్లెక్సీల విషయంలో చూపకపోవడంపై విపక్ష నేతలు మండిపడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఫ్లెక్సీల తొలగింపులో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కరపలోని ఒక ప్రభుత్వ మద్యం దుకాణం సమీపంలో వైసీపీ పోస్టర్లు అంటించి ఉన్నాయి. కోడ్ అమల్లోకి వచ్చి 3 రోజులైనా వాటిని తొలగించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

కొత్తపల్లి: ఎన్నికల కోడ్ మండలంలో సక్రమంగా అమలుకాకపోవడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. సముద్ర తీరప్రాంతాలతో పాటు పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు వేసిన వైసీపీ రంగులను ఇంకా తొలగించలేదు. వైసీపీ రంగులు కనిపించకుండా పూర్తిస్థాయిలో పెయింట్ చేయాలని పలువురు కోరుతున్నారు.

తుని రూరల్: ఎన్నికల కోడ్ వచ్చినా మండలంలో బహిరంగ ప్రదేశాల్లో రోడ్డు వెంబడి రాజకీయ పార్టీ నాయకులు హోర్డింగ్‌లు కనిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అధికార యంత్రాంగం తూతూ మంత్రంగా చర్యలు చేపట్టింది. సచివాలయాల్లో నవరత్నాలకు సంబంధించిన పథకాల బోర్డులు కనిపించి కనిపించనట్టు ముాత వేసి ప్రజలకు దర్శనమిస్తున్నాయి.

గండేపల్లి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ ప్రదేశాల్లో రాజకీయ నాయకుల చిత్రపటాలు ఇంకా తొలగించలేదు. చాలాచోట్ల జగనన్న సిద్ధం ఫ్లెక్సీలు అధికారులు తొలగించలేదు.

రౌతులపూడి: రౌతులపూడి సొసైటీ కార్యాలయంలో వైసీపీ మాజీ మంత్రులుతో ఉన్న ఫ్లెక్సీ తొలగించలేదు. మండలంలో పలు గ్రామాల్లో చాలాచోట్ల వైసీపీ ఫ్లెక్సీలు కన్పిస్తున్నాయి.

సామర్లకోట: సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం సమీపాన వేర్‌హౌసింగ్ గిడ్డంగుల గోడలకు వైసీపీకి చెందిన పెద్దాపురం ఇన్‌చార్జి ఫోటోలతో కూడిన 36 పోస్టర్లను తొలగించలేదు. తహశీల్దార్ కార్యాలయం వెనుక ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమించుకుని నిర్మించిన ఇళ్ల వద్దకు అనధికారికంగా హడావుడిగా 200మీటర్ల మేర పైప్ లైన్లు అమర్చి 6కుళాయిలను ఏర్పాటు చేసినప్పటికీ సోమవారం నాటికి కూడా చర్యలు తీసుకోకపోవడం వెనుక వైసీపీకి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారులు కొమ్ము కాస్తున్నారని పలువురు జనసేన నాయకులు ఆరోపించారు.



గండేపల్లిలో తొలగించని జగన్ ఫ్లెక్సీ



సామర్లకోట వేర్ హౌసింగ్ గోదాముల ప్రహరీపై వైసీపీ పోస్టర్లు

వైసీపీ నుంచి టీడీపీలోకి 200 మంది చేరిక



టీడీపీలో చేరిన కార్యకర్తలతో సత్యప్రభ

రౌతులపూడి, మార్చి 18: మండలంలో ఎస్ఎన్‌పట్నం గ్రామానికి చెందిన 200 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. టీడీపీ నేత, మాజీ సర్పంచ్ లాలం అప్పలనాయుడు సమక్షంలో టీడీపీలోకి చేరగా వారికి జనసేన-టీడీపీ-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వరుపుల సత్యప్రభ పార్టీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. అనంతరం ఎస్ఎన్‌పట్నం, వెంటనగరం, ఈనం గ్రామాల్లో మీ ఇంటికి- మీ రాజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబు అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించారు. ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, టీడీపీ మండలాధ్యక్షుడు తమారల సత్యనారాయణ, అల్లం బాబు, రమణ, ఈగల సత్తిబాబు పాల్గొన్నారు.

యనమల దివ్య సమక్షంలో...

తుని రూరల్: తుని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి యనమల దివ్య సమక్షంలో తుని మండలానికి చెందిన పలువురు యువకులు డి.పోలవరానికి చెందిన పలకా సోమేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి దివ్య పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారు మాట్లాడుతూ మా తొలి ఓటుతో టీడీపీ జెండాను ఎగరవేస్తామన్నారు. గొప్ప విజన్ ఉన్న చంద్రబాబు, పవన్ నాయకత్వంలోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు అని దివ్య తెలిపారు.



టీడీపీలో చేరినవారితో యనమల దివ్య

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

కాకినాడ కమిషనర్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 18: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గర పడుతున్నందున పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశించారు. స్మార్ట్‌సిటీ కార్యాలయంలో సోమవారం పన్నుల వసూళ్లపై అదనపు కమిషనర్ సీహెచ్.నాగనరసింహారావు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.45కోట్ల డిమాండ్‌కుగాను ఇప్పటికి రూ.36కోట్లు వసూలైందన్నారు. మిగిలిన రూ.9 కోట్లు మార్చి నెలాఖరుకు వసూలు చేసే చర్యలు తీసుకోవాలన్నారు. పాతబకాయిలకు సంబంధించి వడ్డీరాయితీ ఉన్నందున పన్ను బకాయిదారులకు వివరించి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజలు చెల్లించే పన్నులతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్ పాల్గొన్నారు.

బడి మానివేసిన పిల్లలపై స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు

పిఠాపురం, మార్చి 18: బడి మానివేసిన పిల్లలును గుర్తించేందుకు పట్టణంలోని రథాలపేట తదితర ప్రాంతాల్లో సోమవారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. జిల్లా గర్ల్ చైల్డ్ అధికారి పి.ఉమామహేశ్వరి, జిల్లా ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ కె.హరికృష్ణ తదితరులు బడి మానివేసిన, ఐదోతరగతి మధ్యలో మానివేసిన పిల్లలను గుర్తించారు. వారందరికి కేజీబీవీలో సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆరోతరగతిలో 40 సీట్లు, ఇంటర్‌లో 40 సీట్లు ఉన్నాయని చెప్పారు. బడి మానివేసిన పిల్లలు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. వారి వెంట సీఆర్పీలు వీరవెంకటేశ్వరరావు, ప్రసాద్, కృష్ణకుమారి, మహిళా పోలీసు, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

నాగేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన



తాటిపర్తిలో లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు రూరల్, మార్చి 18: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణా సమేత నాగేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మూడోరోజు సోమవారం విశేష పూజలు జరిగాయి. నాగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్షబిల్వార్చన నిర్వహించారు. రుద్రహోమం జరిగింది. పూజా కార్యక్రమాలను వేదపండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రిలు నిర్వహించగా, ఆలయ కమిటీ చైర్మన్ గారపాటి బుజ్జి, ప్రధాన కార్యవర్గ సభ్యుడు దాసం వెంకటేష్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి తిరునాళ్లు

గండేపల్లి, మార్చి 18: మండలంలోని తాళ్ళూరు జియ్యన్న మఠంలో వెలసిన వేంకటేశ్వరస్వామి తిరునాళ్లు ఈనెల 20న ప్రారంభకానున్నాయి. వేలసంఖ్యలో భక్తులు గజేంద్రపుష్కరిణిలో స్నానమాచరించి స్వామిని దర్శించుకుంటారు. ఆలయ ఈవో ఉనమట్ల రాజేష్ మాట్లాడుతూ పుష్కరిణిలో స్ఫటిక జల్లి శుభ్రపరిచి కొత్తనీటిని నింపామన్నారు. పుష్కరిణి చుట్టూ గజ ఈతగాళ్లను నియమించామన్నారు. ఆలయ ప్రాంగణంలో చలువపందిళ్లు, క్యూలు ఏర్పాటు చేశామన్నారు.

రాజగోపాలస్వామి కల్యాణోత్సవాలు

ప్రత్తిపాడు, మార్చి 18: మండలంలోని ధర్మవరంలో రుక్మిణి సత్యప్రభ సమేత రాజగోపాలస్వామి కల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఆలయంతోపాటు పరిసరాలు విద్యుత్ దీపాలంకరణలు చేశారు. ఈ నెల 19 నుంచి 25 వరకు కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 21న స్వామి, అమ్మవార్ల కల్యాణం, 24న రథోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని ఆలయ ప్రధాన అర్చకులు అంగర లక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు.

బైక్ ఢీకొని టెన్త్ విద్యార్థికి గాయాలు

కరప, మార్చి 18: బైక్ ఢీకొని పదో తరగతి విద్యార్థి గాయపడినట్టు కరప పోలీసులు తెలిపారు. కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామానికి చెందిన కాతేటి అనిల్‌కుమార్ ఆదివారం రాత్రి తన స్నేహితుడు దమలంక మణికంఠతో కలిసి ఆటోపై కరప వచ్చాడు. తెలుగు ఉపాధ్యాయుడిని కలిసి సోమవారం జరగనున్న తెలుగు పరీక్షకు సంబంధించి ముఖ్యమైన ప్రశ్నల సమాచారాన్ని తెలుసుకున్నాడు. అనంతరం ఇద్దరు తూరంగి తిరిగి వెళ్లడానికి ఊరి పొలిమేరలో ఆటో కోసం ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో కరప నుంచి పెనుగుదురు వైపు వెళ్తున్న మోటర్‌సైక్లిస్ట్ సెల్ ఫోన్ మాట్లాడుతూ అతివేగంగా నిర్లక్ష్యంగా బైక్ నడిపి అనిల్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అనిల్‌కు, మోటర్‌సైక్లిస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మణికంఠ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఫిట్స్‌తో మృతి

కాకినాడ రూరల్, మార్చి 18: రూరల్ మండలం కొవ్వాడలోని షిరిడీ సాయిబాబా గుడికి సమీపంలో సుమారు 60 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి ఫిట్స్‌తో మృతిచెందినట్టు ఇంద్రపాలెం ఎస్‌ఐ మణికుమార్ తెలిపారు. శరీరంపై ఖాకీ రంగు చొక్కా, నీలి రంగు నైట్ ఫ్యాంట్ ఉండగా చొక్కాపై గౌతమ్ అనే ఇంగ్లీషు అక్షరాలు ఉన్నాయన్నారు. వివరాలు తెలిస్తే 9440796555 నెంబర్‌కు ఫోన్‌చేయాలని ఎస్‌ఐ సూచించారు.

అలరించిన గాత్ర కచేరీ

పోర్టుసిటీ (కాకినాడ), మార్చి 18: సరస్వతి గానసభ ఆధ్వర్యంలో నిర్వహించిన గాత్ర కచేరీ విశేషంగా అలరించింది. సంస్థ 120వ వార్షిక సంగీత నృత్య నాటకోత్సవాల్లో భాగంగా స్థానిక సూర్యకళామందిరంలో సోమవారం కార్యక్రమం జరిగింది. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ కొమరుప్రోలు శివప్రసాద్ పాడిన పాటలు అలరించాయి. కొమ్మిరెడ్డి శ్రీరామనరసింగరావు, పెద్దాడ సూర్యకుమారి, కేవీఎస్ ఆంజనేయమూర్తి, పేపకాయల రామకృష్ణ సభ్యులు పాల్గొన్నారు.